ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం



కరీంనగర్‌: మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ వికలాంగుల, వయోవృద్ధుల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి వికలాంగుల సమక్షంలో కేక్‌ కట్‌ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగుల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు. వికలాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు సాధించాలని వసతిగృహంలో ఉండే వికలాంగ విద్యార్థులకు సూచించారు. సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌, వార్డెన్‌ రాధిక పాల్గొన్నారు.

ఐఎస్‌ఏ ఫెస్టివల్‌లో ఆకట్టుకున్న సైకత శిల్పం



కరీంనగర్‌కల్చరల్‌: నగరంలోని మంకమ్మతోటకు చెందిన సైకత శిల్పి రేవెల్లి శంకర్‌ ఒడిస్సా రాష్ట్ర టూరిజం శాఖ నిర్వహించిన ఇంటర్‌నేషనల్‌ సాండ్‌ ఆర్ట్‌ ఫెస్టివల్‌లో మూడో రోజు ఆదివారం కోణార్క్‌ ఆలయ సమీపంలో గల చంద్రభాగా నదీ తీరంలో 'మహిళా సర్వతోముఖాభివృద్ధి' అంశంపై సైకత శిల్పాన్ని రూపొందించి అభినందనలు అందుకున్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ నేటి కాలంలో అన్ని రంగాల్లో రాణిస్తుందనే సందేశంతో ప్రపంచమంతా నీదే నినాదంతో కూడిన మహిళా శక్తిని చాటే శిల్పం అందరినీ ఆకట్టుకుంది.

'కూనంనేని' గెలుపుపై సంబరాలు



కరీంనగర్‌: కొత్తగూడెంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గెలుపుపొందడంతో నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌ ఎదుట ఆదివారం ఏఐఎస్‌ఎఫ్‌, సీపీఐ ఆధ్వర్యంలో పటాసులు కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్‌ సభ్యులు పైడిపల్లి రాజు, పంజాల శ్రీనివాస్‌, నాయకులు న్యాలపట్ల రాజు, ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు సునవత్‌ శ్రీనివాస్‌నాయక్‌, మామిడిపల్లి హేమంత్‌, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, అదపా సాయి, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చార్‌బార్‌.. కమలాకర్‌

- 3,163 ఓట్ల మెజార్టీతో 'గంగుల' గెలుపు
- పోరాడి ఓడిన 'బండి'
- పని చేయని 'హస్తం' హవా
- క్షణక్షణం ఉత్కంఠ రేపిన ఫలితం
- రీకౌంటింగ్‌తో ఉద్రిక్తత
- అంబరాన్నంటిన సంబరాలు

కరీంనగర్‌: ఉద్యమాల పురిటిగడ్డ కరీంనగర్‌ నియోజకవర్గంలో గులాబీ జెండా మరోసారి రెపరెపలాడింది. వరుసగా నాల్గోసారి విజయం సాధించి కరీంనగర్‌ చరిత్రను తిరగరాస్తూ గంగుల కమలాకర్‌ ఎట్టకేలకు విజయం సాధించారు. వెలమ సామాజిక వర్గానికి కంచుకోట అయిన కరీంనగర్‌లో ఊహించని రీతిలో నాలుగు సార్లు గెలుపొంది కరీంనగర్‌ స్థానాన్ని పదిలపర్చుకున్నారు. 2018 ఎన్నికల్లో గంగుల కమలాకర్‌, బండి సంజయ్‌ మధ్య నువ్వా నేనా అన్నట్లు జరిగిన పోరు ఈసారి కూడా అదేస్థాయిలో హోరాహోరీగా రౌండ్‌రౌండ్‌కూ ఫలితం తారుమారు అవుతుండడంతో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. ఇరువురి మధ్య విజయం దోబూచులాడడంతో కరీంనగర్‌ ఫలితంపై ఆసక్తి నెలకొంది. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ విజయం కోసం పోరాడి ఓడారు. కాంగ్రెస్‌ అభ్యర్థి పురమల్ల శ్రీనివాస్‌ రాష్ట్రంలో హస్తం హవా కొనసాగుతున్న ఆ స్థాయిలో పోటీని ఇవ్వలేకపోయారు. చివరకు 326 ఓట్లతో గంగుల విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించడంతో బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌ కౌంటింగ్‌ కేంద్రానికి చేరుకోవడంతో ఎస్సారార్‌ కళాశాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అటు బీఆర్‌ఎస్‌ ఇటు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. దీంతో కాసేపు కౌంటింగ్‌ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రి గంగుల కమలాకర్‌ తన సమీప బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌పై 3,163 ఓట్లతో విజయం సాధించారు. ఇదే స్థానం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్‌ 40,057 ఓట్లను సాధించి మూడో స్థానంలో నిలిచారు. ఎస్సారార్‌ కళాశాల వద్ద నిర్వహించిన కౌంటింగ్‌ కేంద్రంలోనే కరీంనగర్‌తో పాటు హుజూరాబాద్‌, చొప్పదండి, మానకొండూర్‌ నాలుగు నియోజక వర్గాల ఓట్ల లెక్కింపు ఒకేచోట కావడంతో ఆయా నియోజక వర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు, బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ నాయకులతో జగిత్యాల రోడ్‌తో పాటు ఎస్సారార్‌ కళాశాల ప్రాంగణం వరకు జనసందోహం నెలకొంది.

హోరెత్తిన ప్రచారం.. ఆసక్తి రేపిన ఫలితం

కరీంనగర్‌ అసెంబ్లీ ఎన్నిక ఈ దఫా ప్రతిష్టాత్మకంగా మారింది. మూడు ప్రధాన పార్టీల నుంచి బీజేపీ, బీఆర్‌ఎస్‌ అభ్యర్థులుగా బండి సంజయ్‌ కుమార్‌, గంగుల కమలాకర్‌లు బరిలో ఉండడంతో ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి కౌంటింగ్‌ ఫలితాలు వెల్లడయ్యేంత వరకు ఉత్కంఠగా మారింది. రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి నేతలు ప్రచార పర్వాన్ని హోరెత్తించారు. ఓసీలకు కంచుకోటగా మారిన కరీంనగర్‌ నియోజక వర్గంలో ఈసారి బరిలో గత ఎన్నికల మాదిరిగానే ఓసీ అభ్యర్థి లేకపోవడం ముగ్గురు బీసీ అభ్యర్థులే ఉండడంతో ఎన్నిక ప్రక్రియపై రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది. కరీంనగర్‌లోని 60 డివిజన్లతో పాటు కరీంనగర్‌రూరల్‌, కొత్తపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో అభ్యర్థులంతా సుడిగాలి పర్యటన నిర్వహించి ఆయా పార్టీల ప్రముఖులతో రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహించి కరీంనగర్‌ ఎన్నికను మరింత ఆసక్తి రేకెత్తించారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గంగుల కమలాకర్‌కు మద్దతుగా సీఎం కేసీఆర్‌, పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌లు ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించగా, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగిఆదిత్యనాథ్‌తో పాటు తదితరులు ప్రచారం చేశారు కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి పురమల్ల శ్రీనివాస్‌కు ఛత్తీస్‌గఢ్‌ సీఎం బిశ్వాల్‌ భఘే, సీడబ్ల్యూసీ మెంబర్‌ జైరాం రమేశ్‌ తదితరులు కరీంనగర్‌లో పర్యటించి పార్టీ ప్రచార కార్యక్రమాలను హోరెత్తించారు.

అంబరాన్నంటిన సంబరాలు

బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి గంగుల కమలాకర్‌ విజయం సాధించడంతో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎస్సారార్‌ కళాశాల కౌంటింగ్‌కేంద్రానికి వచ్చి బాణసంచా పేలుస్తూ పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. మహిళలు నృత్యాలు చేయగా యువత కేరింతలు కొడుతూ సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్‌ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్‌ చల్ల స్వరూపరాణిహరిశంకర్‌, పొన్నం అనిల్‌కుమార్‌, రెడ్డవేని మధు, బోనాల శ్రీకాంత్‌, బండారి వేణు, ఏవీ రమణతో పాటు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నగరంలో ర్యాలీ నిర్వహించారు.

ఎంఐఎం ఆధ్వర్యంలో సంబరాలు



కరీంనగర్‌ అసెంబ్లీ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గంగుల కమలాకర్‌ గెలుపు పట్ల ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు తెలంగాణ కమిటీ సభ్యుడు అహ్మద్‌ హుస్సేన్‌ ఆధ్వర్యంలో నగరంలోని శ్వేత హోటల్‌ వద్ద విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. అహ్మద్‌ హుస్సేన్‌ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి విజయానికి కృషి చేసిన నగర ప్రజలకు, ఎంఐఎం శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన అరబిక్‌ మరఫా బ్యాండ్‌తో ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేశారు.

క్షణక్షణం ఉత్కంఠ

ప్రచారంలో సాగిన హోరాహోరీ కౌంటింగ్‌ ప్రక్రియలోనూ కొనసాగింది. ఎస్సారార్‌ కళాశాలలోని కౌంటింగ్‌ కేంద్రంలో కరీంనగర్‌ నియోజక వర్గానికి 26 రౌండ్లు కౌంటింగ్‌ చేశారు. కరీంనగర్‌రూరల్‌, కొత్తపల్లి మండలాలకు సంబంధించి గ్రామాల్లో నువ్వా నేనా అన్నట్లుగా ఇరువురు అభ్యర్థులు ఓట్లు సాధిస్తూ స్వల్ప వ్యవధిలో తేడాలు ఉండటం విజయవకాశాలపై ఇరువురు ఆశలు పెంచుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కౌంటింగ్‌ ముగిసిన కరీంనగర్‌ పట్టణంలో మొదలైన కాసేపట్లోనే ప్రతీ రౌండ్‌లో సమీప అభ్యర్థిగా బండి సంజయ్‌ నిలువడంతో అటు బీజేపీ, ఇటు బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. చివరి రౌండ్‌ వరకు అంతా ఆసక్తిగా ఫలితం కోసం వేచి చూశారు. 14వ రౌండ్‌ నుంచి గంగుల కమలాకర్‌ నాలుగు వేలకు పైగా ఆధిక్యత సాధిస్తూ 18వ రౌండ్‌ వరకు 12,900 ఓట్లతో తన అధిక్యాన్ని పెంచుకుంటూపోయారు.19వ రౌండ్‌ నుంచి మళ్లీ బీఆర్‌ఎస్‌పై బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ రౌండ్‌రౌండ్‌కూ ఆధిక్యత ప్రదర్శించడంతో ఫలితం తారుమారు అవుతుందనే ఆసక్తితో ప్రజలు ఎదురుచూశారు. 24వ రౌండ్‌లో బీఆర్‌ఎస్‌పై బీజేపీ 1,088 ఓట్ల ఆధిక్యం రావడంతో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మెజార్టీ 4,648 ఓట్లకి పడిపోయింది. దీంతో బీఆర్‌ఎస్‌, బీజేపీ శ్రేణుల్లో ఒకింత ఉత్కంఠ నెలకొంది. చివరికి 326 ఓట్లతో గంగుల కమలాకర్‌ గెలిచినట్లు ప్రకటించడంతో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ అభ్యంతరం చెప్పడం, రీకౌటింగ్‌ చేయాలని పట్టుబట్టడంతో మొరాయించిన రెండు ఈవీఎంలను లెక్కించగా 3,163 ఓట్లతో గంగుల కమలాకర్‌ విజయాన్ని అధికారికంగా ప్రకటించడంతో ఆయన మద్దతు దారులు అధిక సంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఓటింగ్‌ పెంచిన ప్రత్యేక కేంద్రాలు

- మెరుగైన ఓటింగ్‌శాతం నమోదు
- 112(హుజూరాబాద్‌)లో అత్యధికం 87.1 శాతం పోలింగ్‌
- అత్యల్పంగా 126(కరీంనగర్‌)లో 16.37శాతం

కరీంనగర్‌ అర్బన్‌: ప్రత్యేక పోలింగ్‌ కేంద్రాలతో ఎన్నికల సంఘం మెరుగైన ఫలితాలు పొందింది. ఓటర్లను పోలింగ్‌ బూత్‌ వైపుకు నడిపించేందుకు మహిళా, మోడల్‌ పోలింగ్‌ కేంద్రాలతో పాటు కొత్తగా దివ్యాంగులు, యువ పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేసింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు గానూ 48 ప్రత్యేక పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఒక్కో నియోజకవర్గంలో ఐదు మహిళా, ఐదు మోడల్‌, ఒక దివ్యాంగులు, ఒక యువ పోలింగ్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 20 పోలింగ్‌ కేంద్రాల్లో 70–80శాతం పోలింగ్‌ నమోదు కాగా.. 21పోలింగ్‌ కేంద్రాల్లో 80కి పైగా పోలింగ్‌ శాతం నమోదైంది. ఆరుకేంద్రాల్లో 60–70శాతం పోలింగ్‌ నమోదవగా ఒక కేంద్రంలో 16.37శాతం పోలింగ్‌ నమోదైంది. మానకొండూరు నియోజకవర్గంలోని ప్రత్యేక కేంద్రాల్లో ఒక కేంద్రం మినహా 11 కేంద్రాల్లో 80శాతానికి పైగా పోలింగ్‌ నమోదవడం స్వాగతించదగ్గ పరిణామం.

మహిళా పోలింగ్‌ కేంద్రాల్లో పోలింగ్‌ సరళి ఇలా..

- కరీంనగర్‌ నియోజకవర్గంలోని 36 రేకుర్తి కేంద్రంలో 1,479 మంది ఓటర్లకు 925 మంది ఓటేశారు. ఇందులో 474మంది మహిళలు ఉండగా.. 62.54శాతం ఓటింగ్‌ నమోదైంది. 68 తీగలగుట్టపల్లిలో 1504 మంది ఓటర్లకు 1,065మంది ఓటేశారు. ఇందులో 509మంది మహిళలు ఓటింగ్‌లో పాల్గొనగా.. 70.81శాతం పోలింగ్‌ నమోదైంది. గుంటూరుపల్లి కేంద్రంలో 904 మంది ఓటర్లు ఉండగా.. 148 మందే ఓటేశారు. ఇందులో 114మంది మహిళలు ఉన్నారు. 16.37శాతం పోలింగ్‌ నమోదైంది. 252 కార్ఖానగడ్డలో 1,342 మంది ఓటర్లు ఉండగా.. 868 మంది ఓటేశారు. వీరిలో 463మంది మహిళలు ఉన్నారు. 64.68 శాతం పోలింగ్‌ నమోదైంది. 292రాంపూర్‌లో 1,484 ఓటర్లకు 482 మంది మహిళలు ఓటేశారు.
- హుజూరాబాద్‌ నియోజకవర్గంలో 43 హుజూరాబాద్‌లో 485మంది ఓటర్లు ఉండగా.. 325మంది ఓటేశారు. వీరిలో 169మంది మహిళలు ఉండగా 67.0శాతం ఓటింగ్‌ నమోదైంది. 112నర్సింగపూర్‌ బూత్‌లో 638మంది ఓటర్లు ఉండగా 556మంది ఓటేశారు. వీరిలో 293మంది మహిళలు ఉన్నారు. 87.10శాతం పోలింగ్‌ నమోదైంది. 177 జమ్మికుంటలో 838మంది ఓటర్లు ఉన్నారు. 555మంది ఓటేశారు. వీరిలో 291మంది మహిళలు ఉండగా 66.20శాతం ఓటింగ్‌ అయ్యింది. 226 శ్రీరాములపల్లిలో 629మందికి 541మంది ఓటేశారు. వీరిలో 271 మంది మహిళలు ఉండగా .. 86.0శాతం పోలింగ్‌ రికార్డయ్యింది. 268కమలాపూర్‌లో 874మందికి 368 మంది ఓటేశారు.
- మానకొండూర్‌ నియోజకవర్గంలోని 10మానకొండూరు బూత్‌లో 665 మంది ఓటర్లకు 544మంది ఓటేశారు. 81.80శాతంగా నమోదైంది. 159 రామకృష్ణాకాలనీలో 1067 మంది ఓటర్లకు 821 మంది ఓటేశారు. 76.94శాతంగా పోలింగ్‌ పోలింగ్‌ నమోదైంది. 192 పర్లపల్లిలో 957మందికి 812 మంది ఓటేశారు. 84.85శాతం ఓటింగ్‌ నమోదైంది. 108జంగపల్లిలో 844కు 658మంది, 215 కొత్తగట్టులో 712కి 619మంది ఓటేశారు.
- చొప్పదండి నియోజకవర్గంలోని 29గంగాధరలో 721మందికి 472, 84 రామడుగులో 740కు 532మంది ఓటేశారు. 175 రుక్మాపూర్‌లో 635మందికి 502 మంది ఓటేశారు. 188 బూరుగుపల్లిలో 371మందికి 293 మంది ఓటేశారు. 250 కొడిమ్యాలలో 690 మందికి 486 మంది ఓటేయ్యగా.. 70.43శాతం పోలింగ్‌ నమోదైంది.



కార్ఖానగడ్డలో మహిళా పోలింగ్‌ కేంద్రం

మోడల్‌ పోలింగ్‌ కేంద్రాల్లో ఇలా..

పోలింగ్‌ కేంద్రం	మొత్తం ఓటర్లు	ఓటేసింది	పురుషులు	మహిళలు	శాతం
50 కొత్తపల్లి	1,092	859	414	445	78.66
62 ఆరెపల్లి	790	583	299	284	73.8
84 ఫకీర్‌పేట	544	449	239	219	82.54
284 కరీంనగర్‌	958	559	272	287	58.35
3 నాగుల మల్యాల	1,035	861	427	434	83.19
4 చెల్పూరు	631	511	258	253	81.0
104 వీణవంక	1,096	904	426	478	82.5
171 జమ్మికుంట	814	590	302	288	72.5
225 ఇల్లందకుంట	1,184	1,004	486	518	84.8
265 కమలాపూర్‌	1,014	796	394	402	78.5
8 మానకొండూరు	706	574	284	290	81.3
184 పర్లపల్లి	994	816	422	394	82.09
205 జంగపల్లి	1,090	916	466	450	84.04
85 కొత్తగట్టు	588	489	248	241	83.16
222 బెజ్జంకి	701	566	286	280	80.74
26 గంగాధర	643	492	219	273	76.52
86 రామడుగు	1065	805	383	422	75.52
156 గాంధీనగర్‌	653	516	251	265	79.02
204 వెంకట్రామ్‌పల్లి	1,040	857	408	449	82.40
256 కొడిమ్యాల	794	606	273	333	76.32

దివ్యాంగుల పోలింగ్‌ కేంద్రాల్లో ఇలా..

పోలింగ్‌ కేంద్రం	మొత్తం ఓటర్లు	ఓటేసింది	పురుషులు	మహిళలు	శాతం
2 విద్యానగర్‌	544	414	198	216	76.1
35 హుజూరాబాద్‌	556	439	215	224	79.0
150 పోరండ	1,004	877	429	448	87.35
126 దేశాయ్‌పేట	800	681	327	354	85.13

యువ పోలింగ్‌ కేంద్రాల్లో ఇలా..

పోలింగ్‌ కేంద్రం	మొత్తం ఓటర్లు	ఓటేసింది	పురుషులు	మహిళలు	శాతం
27 చింతకుంట	1279	921	473	448	72.01
31 హుజూరాబాద్‌	711	572	272	300	80.5
18 ముంజంపల్లి	1,046	896	453	443	85.66
67 గోపాల్‌రావుపేట	1,059	762	379	383	71.95

పవర్‌కట్‌ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్‌ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ మంకమ్మతోట ఫీడర్‌ పరిధిలోని మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్‌, కాశ్మీర్‌గడ్డ, గోపాల్‌రావు బంగ్లా ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్‌–2 ఏడీఈ ఎం.సుధీర్‌ కుమార్‌ తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'పురుమల్ల'కు షాక్‌

- బొమ్మకల్‌లో కారు జోరు
- కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్‌కు 1,398 ఓట్ల ఆధిక్యం

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్‌కు సొంత గ్రామం షాక్‌ ఇచ్చింది. మొత్తం 12 వేల ఓట్లలో సగానికి పైగా మెజార్టీ ఓట్లను సాధిస్తానని ఆశించిన శ్రీనివాస్‌కు ఫలితాలు నిరాశను మిగిల్చాయి. కాంగ్రెస్‌ కంటే ఎక్కువ ఓట్లను సాధించి బీఆర్‌ఎస్‌ తన ఆధిక్యతను ప్రదర్శించింది. కొన్నేళ్ల నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం బొమ్మకల్‌లోని రామాలయం నుంచి బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. బొమ్మకల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి విస్తృత ప్రచారంతో కాంగ్రెస్‌ ఓట్లను గండికొట్టి పైచేయి సాధించడంలో సఫలీకృతులయ్యారు. కాంగ్రెస్‌ నుంచి పోటీ చేసిన సర్పంచ్‌ శ్రీనివాస్‌ ప్రాతినిధ్యం వహిస్తున్న బొమ్మకల్‌ గ్రామంలో మొత్తం 12,251 ఓట్లుండగా 7,788 ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్‌కు 3,582, కాంగ్రెస్‌కు 2,184, బీజేపీకి 1,696 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌ పార్టీ కంటే బీఆర్‌ఎస్‌కు 1,398 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. మొత్తం 14 పోలింగ్‌కేంద్రాల పరిధిలో ఏ కేంద్రంలో కూడా బీఆర్‌ఎస్‌ కంటే కాంగ్రెస్‌ పార్టీకి ఎక్కువ ఓట్లు రాలేదు. బీజేపీ సైతం పోలింగ్‌ కేంద్రాలు 114, 117, 118, 121లో కాంగ్రెస్‌ కంటే ఎక్కువ ఓట్లు సాధించడం విశేషం.

5న గిరిజా గోశాల వార్షికోత్సవం

తిమ్మాపూర్‌: మండలంలోని మహాత్మానగర్‌ పంచాయతీ పరిధిలోని ఎల్‌ఎండీ కాలనీలోని మృత్యుంజయాలయం ఆవరణలోని గిరిజా గోశాల ఆరో వార్షికోత్సవం ఈనెల 5న నిర్వహించనున్నట్లు ఆలయం, ట్రస్టు నిర్వాహకులు మోహన్‌రెడ్డి, లక్ష్మణరావు, బాలకిషన్‌ రావు తెలిపారు. అష్టమి తిథి రోజున ఉదయం తొమ్మిది గంటల నుంచి గోశాల ఫౌండర్‌, చైర్మన్‌ బ్రహ్మశ్రీ వేదమూర్తులు పురాణం మహేశ్వరశర్మ నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు గోమహాయాగం, గోవ్రతం, కార్తీక మాసం సందర్భంగా పూజలు, సామూహికంగా భక్తులతో నిర్వహిస్తామన్నారు. భక్తులు మంగళహారతి తెచ్చుకోవాలని సూచించారు. కార్తీక దామోదర పూజ, తులసీ కల్యాణం తదనంతరం కార్తీక మాస విశిష్టత, గోశాల గూర్చి పురాణం మహేశ్వరశర్మ వివరిస్తారని. మధ్యాహ్నం నుంచి కార్తీక సామూహిక వనభోజనంలుంటాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

శ్రీకాంతాచారికి నివాళి



శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో అమరుడైన శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించారు. ఆదివారం గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం మండలశాఖ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌ మాట్లాడుతూ.. శ్రీకాంతాచారి విగ్రహాన్ని ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు సదాచారి, నాయకులు వెంకటరమణ, సదాచారి, చిరంజీవి, వెంకటచారి, రాజయ్య, సాంబయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ సంబరాలు



డీసీసీ కార్యాలయం ఎదుట బాణసంచా కాలుస్తున్న పార్టీ కార్యకర్తలు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారం చేపట్టనున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు నగరంలో సంబరాలు నిర్వహించారు. ఆదివారం చేపట్టిన ఓట్ల లెక్కింపులో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో ఎనిమిది స్థానాలను కాంగ్రెస్‌ కైవసం చేసుకోవడంతో పాటు హుస్నాబాద్‌ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ విజయం సాధించారు. దీంతో నగరంలోని డీసీసీ కార్యాలయం ఎదుట, మంకమ్మతోటలోని పొన్నం ప్రభాకర్‌ నివాసం ఎదుట బాణాసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశపాలనకు ప్రజలు వీడ్కోలు పలికారని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకొనే కాంగ్రెస్‌ పార్టీని ప్రజలు ఆదరించారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి మెనేని రోహిత్‌రావు, కాంగ్రెస్‌ పార్టీ నగరం అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు ఎండీ.తాజ్‌, పడాల రాహుల్‌, అబ్దుల్‌ రెహమాన్‌, కల్వల రామచందర్‌, ఎస్‌ఏ. మోసిన్‌, ముల్కల ప్రవీణ్‌, బొబ్బిలి విక్టర్‌, గుండాటి శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ నాయకుల వాగ్వాదం



తిమ్మాపూర్‌: మానకొండూరు కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందడంతో పార్టీ శ్రేణులు ఎల్‌ఎండీ కాలనీలో సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌ వద్ద కాంగ్రెస్‌ జెండాలతో వచ్చి పటాకులు పేల్చారు. బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న సమయంలో కాంగ్రెస్‌ శ్రేణులు అక్కడికి చేరుకొని బాణసంచా పేల్చడం వివాదానికి దారి తీసినట్లు తెలిసింది. ఎల్‌ఎండీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రెండు పార్టీల నాయకులకు సర్దిచెప్పారు.